'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## గవర్నర్లకు కోర్టు అక్షింతలు

**గవర్నర్** అనేది రాష్ట్ర పరిధిలో అత్యున్నత రాజ్యాంగ పదవి. రాష్ట్ర పరిపాలన అంతా గవర్నర్ పేరు మీదనే సాగుతుంది. ఎంతో హుందాతనంతో, పరిణతితో ఆ పదవిని నిర్వహించాల్సిన అవసరముంటుందని ప్రత్యేకించి చెప్పుకోవాల్సిన అవసరం లేదు. కానీ ఇటీవలి కాలంలో గవర్నర్లు తరచుగా వివాదాల్లో చిక్కుకోవడం దురదృష్టకరం. కేంద్ర ప్రతినిధిగా, సంధానకర్తగా వ్యవహరించాల్సిన గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా విపక్ష రాష్ట్ర ప్రభుత్వాలపై వేధింపులకు దిగుతున్నారు. ఎన్నికైన ప్రభుత్వాల పనితీరుకు అడ్డం పడుతూ ప్రజాప్రాతినిధ్య పాలనను అభాసుపాలు చేస్తున్నారు. సమాఖ్య స్ఫూర్తికి చిల్లులు పెడుతున్నారు. నామమాత్రంగా అనుమతి ఇవ్వాల్సిన బిల్లులకు మోకాలడ్డుపెట్టి రాష్ట్ర ప్రభుత్వాలను ముప్పుతిప్పలు పెడుతున్నారు. కేంద్రంలోని పాలకపక్ష విధానాలకు అనుగుణంగా వ్యవహరిస్తూ రాజకీయ నిష్పాక్షికతకు నీళ్లు వదులుతున్నారు. లేనిపోని కొర్రీలు వేస్తూ, మీడియా ముందుకు వస్తున్నారు. శాసన వ్యవస్థతో కలిసిమెలిసి పనిచేయాల్సిన గవర్నర్లు ప్రత్యర్థుల్లా మారుతున్నారు.

ఇటీవలి కాలంలో తెలంగాణ, తమిళనాడు, కేరళ, బెంగాల్ గవర్నర్లు తమ తమ రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులు పెట్టడం మనం చూస్తున్నాం. తమిళనాడు గవర్నర్ రవి ఏకంగా ఓ మంత్రినే తన ఇచ్ఛానుసారం బర్తరఫ్ చేసి, వెంటనే ఆ నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవడం ఆ మధ్య సంచలనం సృష్టించింది. డీఎంకే సర్కారు విధానాలను ఆయన బాహాటంగానే విమర్శిస్తూ మీడియాకెక్కారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై బిల్లులను పెండింగ్‌లో పెట్టడం, రాష్ట్ర ప్రభుత్వం కోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఇక బెంగాల్‌లో మమతా బెనర్జీ సర్కారుపై గవర్నర్ విమర్శలు గుప్పించడం నిత్యకృత్యమైంది. అనేక సందర్భాల్లో కోర్టులు గవర్నర్ల పాత్రపై విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశాయి. తాజాగా కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్‌ఖాన్‌పై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు వ్యవస్థ ప్రస్తుత దుస్థితికి అద్దం పడుతున్నాయి.

కేరళ శాసనసభ ఆమోదించిన ఎనిమిది బిల్లులపై నిర్ణయం తీసుకోకుండా రెండు సంవత్సరాల నుంచి ఏం చేస్తున్నారని సర్వోన్నత న్యాయస్థానం ఘాటుగా నిలదీసింది. ఆ బిల్లులను ఆపివేయటానికి కారణాలేవీ గవర్నర్ చూపలేకపోయారని కూడా ఎత్తిచూపింది. కేరళ గవర్నర్ దగ్గర మొత్తం ఎనిమిది బిల్లులు పెండింగులో ఉండగా అందులో ఏడింటిని రాష్ట్రపతి పరిశీలనలకు పంపి, ఒకదానికి ఆమోదం తెలిపారు. అదీ వివాదం కోర్టు మెట్లెక్కిన తర్వాతనే. ఇదివరకే అమలులోకి తెచ్చిన ఆర్డినెన్సుల స్థానంలో ప్రవేశపెట్టిన బిల్లులను ఇన్నాళ్లుగా తొక్కిపెట్టి ఇప్పుడు రాష్ట్రపతి పరిశీలనకు పంపడం ఏమిటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ముఖ్యమంత్రితో, సంబంధిత మంత్రితో గవర్నర్ మాట్లాడాలని సూచించింది. రాజకీయ విజ్ఞత ద్వారానే పరిష్కారం కనుగొనాలని హితవు చెప్పింది. ఈ వివాదం ఇలాగే కొనసాగితే తన రాజ్యాంగ బాధ్యతల మేరకు స్వయంగా మార్గదర్శకాలను జారీచేయడం గురించి పరిశీలిస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించడం గమనార్హం.

ఎన్నికైన ప్రభుత్వాల పనికి అడ్డుపడటం మంచిది కాదని, తాము ఎన్నికైన ప్రజా ప్రతినిధులం కామని గుర్తెరగాలని సుప్రీంకోర్టు ఇదివరకే గవర్నర్లకు హితవు చెప్పింది. బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు నిర్ణీత గడువు అంటూ ఉండాలని కూడా అభిప్రాయపడింది. గవర్నర్ పదవిని అడ్డుపెట్టుకుని కేంద్రం తన అభీష్టాల్ని, పంతాల్ని తీర్చుకునేందుకు ప్రయత్నించడం కొత్తేమీ కాదు. నిజానికి కాంగ్రెస్ హయాంలోనే గవర్నర్ల వ్యవస్థ దుర్వినియోగం మొదలైంది. రానురాను అది శృతిమించిపోయి వెర్రితలలు వేసింది. కేంద్రానికి గిట్టని రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపేదాకా పోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీయార్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిని చేసిన గవర్నర్ రాంలాల్ ఉదంతం తెలిసిందే. ప్రస్తుత బీజేపీ పాలనలోనూ గవర్నర్ల తీరుతెన్నుల్లో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో బ్రిటిష్ వలసపాలన అవశేషంగా మిగిలిపోయిన గవర్నర్ పదవి ప్రాసంగికతే ప్రశ్నార్థకమవుతున్నది.

# తెలంగాణ సార్వభౌమాధికారంపై రాజీ కుదరదు

ఆంధ్ర రాష్ట్రంతో బలవంతపు విలీనం నుంచి తెలంగాణ బయటికి వచ్చి పదేండ్లవుతున్నది. స్వతంత్ర భారతదేశంలో తెలంగాణను రాజకీయ అనాథలా చూశారు. యావత్తు భారతదేశానికి 1947, ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే తెలంగాణకు 1948, సెప్టెంబర్ 17న వచ్చింది. కేంద్ర మిలిటరీ, పౌరపాలన కింద 1948 నుంచి 1952 వరకు నాలుగేండ్లు గడిచాయి. 1953 నుంచి 1956 వరకు హైదరాబాద్ రాష్ట్రం కొంత రాజకీయ స్వాతంత్ర్యం అనుభవించింది.

దేశంలోని కొన్ని ప్రాంతాల నుంచి వచ్చిన భాషా ప్రయుక్త రాష్ట్రాల డిమాండ్ల మేరకు రాష్ట్రాల పునర్విభజన కమిషన్ (ఎస్ఆర్‌సీ) ఏర్పాటైంది. ఎస్ఆర్‌సీ కంటే ముందే భాష ప్రాతిపదికపై 1953లో ఆంధ్రరాష్ట్రం మద్రాసు నుంచి విడిపోయింది. చెల్లాచెదురుగా ఉన్న భాషాధిక్య ప్రాంతాలను ఇటూ అటూ కలపడం, తీసేయడం ద్వారా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ వంటి భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటయ్యాయి.



జేఆర్ జానుంపల్లి
83743 68944



తెలంగాణ, దాని పాలకపక్షం రాష్ట్ర స్థూల, సర్వ సమగ్రాభివృద్ధి పథాన్ని ఎంచుకొని, సత్వర అభివృద్ధిలో అంగలు వేస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీలు తమ కాలం చెల్లిపోయిన కుల, మత రాజకీయాలతో, రాష్ట్ర విభజనపై పచ్చి అబద్ధాలతో నిస్పృహను రాజేస్తూ తెలంగాణ రాష్ట్ర సత్వరాభివృద్ధిని పట్టాలు తప్పించాలని చూస్తున్నాయి. ప్రగతి నిరోధక భావజాలంతో, కట్టు కథలతో పురోగతిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. కానీ, అవేవీ పనిచేసే సూచనలు కనిపించడం లేదు. కొత్త రాష్ట్రం బలాలేమిటో, పాలకపక్షం చేపట్టిన వ్యూహాత్మక పునర్నిర్మాణం ఏమిటో ప్రజలు తమ కండ్లారా చూసి ఉండటమే అందుకు కారణం.

భాష ప్రాతిపదికపై ఏర్పడిన కొత్త రాష్ట్రాల్లోని ప్రజలు అన్నాదమ్ముల్లా కలిసిపోయారు. ఆంధ్ర-తెలంగాణ విలీనం విషయంలో అది జరగలేదు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డప్పుడు తెలంగాణకు తెలుగు భాష మాట్లాడేవారి ప్రాంతంగా గుర్తింపు లేదు. 1956లో ఎస్ఆర్‌సీ కూడా మిగులు హైదరాబాద్ (తెలంగాణ) రాష్ట్రాన్ని ఆంధ్రాతో కలుపమని చెప్పలేదు. ఒకవేళ భాష ఒకటే అనుకున్నా అప్పటి పరిస్థితుల్లో విలీనం అవసరమని భావించలేదు. తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగించి, 1962 సార్వత్రిక ఎన్నికల తర్వాత రెండు రాష్ట్రాలు కోరుకుంటే విలీనం గురించి ఆలోచించవచ్చని సూచించింది. తెలంగాణ ప్రజలు మొదటినుంచీ విడిగా ఉండాలనే కోరుకున్నారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఆంధ్ర రాష్ట్రానికి సాయపడేందుకు వేసిన రాజకీయ ఎత్తుగడల ఫలితంగా కేంద్రం సమైక్య ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటుచేసింది. తెలంగాణను ఒప్పించేందుకు అనేక రక్షణలతో కూడిన పెద్ద మనుషుల ఒప్పందం చేయించారు.

సమైక్య ఆంధ్రప్రదేశ్ అస్తిత్వంలోకి రావడంతో మెజారిటీ ఆధిపత్యం పగ్గాలు చేపట్టింది. అనతికాలంలోనే పెద్ద మనుషుల ఒప్పందాన్ని మరిచిపోయారు. తెలంగాణ అదనపు ఆదాయంతో సమతూకం చేసి సమైక్య ఏపీ బడ్జెట్ రూపొందించేవారు. తెలంగాణ ఆదాయం, ఉద్యోగాలు, నదీజలాల వాటాకు రక్షణ కల్పించే పెద్ద మనుషుల ఒప్పందాన్ని ఇష్టారాజ్యంగా ఉల్లంఘించారు. ఫలితంగా 1969 ఉద్యమం వచ్చింది. తిరుగుబాటును అణచివేసేందుకు 369 మంది తెలంగాణ బిడ్డలను పోలీసు కాల్పుల్లో చంపేశారు. మూల ఒప్పందాలను నీరుగార్చేందుకు 8 సూత్రాల పథకాలు, 6 సూత్రాల పథకాలు ముందుకుతెచ్చారు. అదివరకే ఆంధ్రాకు మళ్లించిన నిధులతో సహా తెలంగాణ ఆదాయాన్ని ఈ ప్రాంతానికే ఖర్చు చేయాలని ఒప్పందం కుదిరింది. అయినా ఏమీ జరుగలేదు. ఆ సూత్రాలను పక్కనపెట్టేందుకు చట్టసభల్లోని మెజారిటీని వాడుకున్నారు. హైదరాబాద్ ఆంధ్రాకు బంగారు గని అయింది. రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా తెలంగాణ ప్రాంతం రెండోస్థాయికి దిగజారింది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ రాజుకున్నది. జాతీయపార్టీలు తమ రాజకీయ అవసరాల కోసం దాన్ని ఎగదోశాయి. తుది దశ రాజకీయ పోరాటం 2001 నుంచి 2009 మధ్యకాలంలో జరిగింది. ఏపీ శాసనసభ వెలుపల అన్ని పార్టీల ఒప్పందాల తర్వాత 2009 డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రకటన వెలువడింది. కానీ, కొద్దిరోజుల్లోనే కేంద్రం, ఆంధ్ర ప్రాంతం మాట మార్చాయి.

ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడుతున్న తెలంగాణ మెడలు వంచేందుకు విచిత్రమైన సమైక్యాంధ్ర ఉద్యమం నడిపించారు. తెలంగాణ ఆకాంక్షలను అంతం చేసేందుకు ఉద్దేశించిన కుటిల జన విద్వేష రాజకీయ ఎజెండాతో అది వచ్చింది. నాలుగున్నరేండ్ల తర్వాత అది వీగిపోయింది.

కాంగ్రెస్ విద్రోహాన్ని నిరసిస్తూ వందలాది మంది తెలంగాణ బిడ్డలు ఆత్మార్పణకు పాల్పడ్డారు. ఈలోగా పక్షపాత రాజకీయాలకు పాల్పడ్డప్పటికీ రెండు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఆంధ్రాలో కాంగ్రెస్ బలహీనపడటం మొదలైంది. ముప్పై పైచిలుకు ఉప ఎన్నికలు జరిగితే అందులో దాదాపు అన్నింటిలో వైఎస్సార్‌సీపీ, టీఆర్ఎస్ చేతుల్లో కాంగ్రెస్ పరాజయం పాలైంది. జరుగబోయే సార్వత్రిక ఎన్నికల్లో గెలిచే అవకాశాలు కనిపించ లేదు. తెలంగాణలో అధికారం దక్కించుకునేందుకు, కొన్ని ఎంపీ స్థానాలు పదిలం చేసుకునేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో కాంగ్రెస్ చివరి నిమిషంలో పార్లమెంటులో తెలంగాణ బిల్లును హడావిడిగా తీసుకువచ్చింది. ఎన్నికల్లో ఓడిన కాంగ్రెస్ ఆంధ్రాలో, కేంద్రంలో అధికారం కోల్పోయింది.తెలంగాణలోనూ గెలవలేకపోయింది. తెలంగాణకు వ్యతిరేకంగా తాను సాగించిన అనైతిక రాజకీయాలకు తానే బలైపోయింది. ఈ చరమాంకంలోనే కాదు, 1956 ఆ తర్వాత కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా తెలంగాణను రాజకీయ అనాథలానే చూశాయి. ఎస్ఆర్‌సీ సిఫారసు చేయలేదు. నెహ్రూ సామ్రాజ్యవాదం అన్నాడు కూడా. అయినప్పటికీ తెలంగాణ గతి ఏం కానున్నదో స్పష్టమైపోయింది. కేంద్రం బలవంతంగా తెలంగాణను ఆంధ్రాలో కలిపేసింది. ఎన్ని ఉద్యమాలు వచ్చినా పట్టించుకోకుండా విధికి వదిలేసింది. కేంద్రం వేర్వేరు రాష్ట్రాల విషయంలో వేర్వేరు వైఖరి అవలంబించింది. మహారాష్ట్ర, పంజాబ్ విషయం లో తన నిర్ణయాన్ని 1960, 1966లో సవరించుకున్నది. 2000లో బీజేపీ అడిగితే చాలు అన్నట్టుగా మూడు రాష్ట్రాలను విభజించింది. హామీ ఇచ్చిన తెలంగాణను మాత్రం టీడీపీకోసం పక్కనపెట్టింది. ఈశాన్యం లో కూడా ఎన్నో ఉదాహరణలున్నాయి. తెలంగాణ విషయంలో మాత్రం 58 ఏండ్లు, 1500కు పైగా చావుల తర్వాత నిర్ణయం జరిగింది. అనేక వలస దేశాల్లోనూ స్వాతంత్ర్య పోరాటాల్లో ఇంతమంది మరణించిన దాఖలాలు లేవు.

జస్టిస్ ఫజుల్ అలీ, పండిత్ నెహ్రూల జోస్యాలు నిజం కావడమే కాదు, తెలివైన ఆంధ్రుల చేతుల్లో ఈ ప్రాంత దోపిడీ అంచనాలను మించిపోయింది. ఇప్పుడు విభజన తర్వాత తెలంగాణ ఆదాయం, ఇతర వనరుల విషయంలో చెప్పు కొన్న లెక్కలన్నీ నిజమేనని తేలింది. తొమ్మిది ప్రధానమైన ఆర్థిక విభాగాల్లో తన సత్తా ఏమిటో తెలంగాణ తొమ్మిదేండ్లలోనే చాటిచెప్పింది. కేంద్రం మద్దతు ఏ మాత్రం లేకుండానే ఎన్ఎస్‌డీపీలో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. 1956లో విడిగా ఉండనిచ్చినా, లేదా 1969లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసినా రాష్ట్రాల సమాఖ్యలో తెలంగాణ ఇంకా ఎంతో సమున్నతమైన స్థితిలో ఉండేది.

తెలంగాణను కాంగ్రెస్ రాజకీయ అనాథగా చూసిన సుదీర్ఘ చరిత్ర తెలంగాణ ప్రజలకు తెలుసు. 2014లో ఆ పార్టీని విస్పష్టంగా తిరస్కరించారు. ప్రతిపక్షం కావడానికి అవసరమైనన్ని సీట్లు మాత్రమే ఇచ్చి ఊరుకున్నారు. 2018లో మరోసారి కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించారు. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ పట్ల బీజేపీ మెతక వైఖరి, తుది ఘట్టంలో శల్య సారథ్యం, గత 9-10 ఏండ్ల కాలంలో చూపిన సవతి తల్లి ప్రేమ కూడా ప్రజలకు తెలుసు. ఇప్పుడీ రెండు పార్టీలు తెలంగాణను సార్వ భౌమాధికారాలు గల రాష్ట్రంగా చూసి, ఇక్కడి ప్రజలు తమ రాజకీయ విజ్ఞతను చూపారని తెలుసుకొని, ఇక్కడి ప్రభుత్వం ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో పునరుజ్జీవనాన్ని సాధించిందని, రాష్ట్రాన్ని రాజకీయ అనాథగా చూడటాన్ని ఇక్కడి ప్రజలు ఇక ఎంతమాత్రం సహించే స్థితిలో లేరని గ్రహించాలి.

ఈ నేపథ్యంలో, 'సాంకేతికంగా చూస్తే తెలంగాణ ఇవ్వాల్సిన అవసరం లేదనడం' పిచ్చిమాటే. ఇక హైదరాబాద్ కేంద్రంగా బీజేపీ నడిపే మత రాజకీయాలు, యూటీ, రెండో రాజధాని అంటూ చేసే హంగామా, స్థానిక, ఆంధ్రా ప్రాంతంలోని నిస్పృహకు గురైన శక్తులు వేసే రాజకీయ ఎత్తుగడలూ సాధించేదేమీ ఉండదు. తెలంగాణ ప్రజలు రాజకీయ స్వాతంత్ర్యాన్ని, తమ వనరులపై సార్వభౌమాధికారాన్ని, ప్రగతి పరుగులను అనుభవించారు. ఎక్కడో దూరాన కూర్చుండి పెత్తనం చేసే పార్టీలకు దీన్నంతటినీ అప్పగించే ఆలోచనలో ఎలా ఉంటారు. నిరాశలో కునారిల్లుతున్న స్థానిక అతుకుల బొంతలనూ వారు పట్టించుకోవడం లేదు.

తెలంగాణ రాష్ట్రం శాశ్వతం, సొంత ప్రజలే దాని భాగ్య విధాతలు. బయటివారు కాదు. దీనిపై ఎలాంటి రాజీకి తావు లేదు!

అనువాదం: తుమ్మలపల్లి రఘురాములు

# కేసీఆర్ ఓ కేంద్ర బిందువు



రాజేంద్రప్రసాద్ చేలిక
99858 35601

మార్పు ప్రకృతి సహజం. కావాల్సిన సమయంలో తప్పకుండా జరగాల్సిందే. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎవ్వరు ఆపాలని చూసినా అది జరగాల్సినప్పుడు ఆరు నూరైనా, నూరు ఆరైనా జరిగి తీరుతుంది. మార్పులో మంచికి ఎక్కువ స్థానముంటే అంతా సంబురపడుతారు. అలాకాకుండా ముంచేతత్వంతోనే మార్పును కోరుకుంటే మొదటికే మోసం.



తెలంగాణ రాష్ట్రం ఒక కల. కోట్లాది తెలంగాణ బిడ్డలను ఊరించిన ఆరున్నర దశాబ్దాల వాంఛ. ఎందుకోసమో కలిపారు. మరెవరి కోసమే ఈ ప్రాంతాన్ని తొక్కిపెట్టారు. చేయని తప్పుకు చేతులు కట్టుకొని చూస్తూ ఊరుకోవడం తప్ప ఇక్కడి ప్రజలు చేసేదేమీ లేక భరించారు. ప్రాణాలను అర్పించారు. అయినవాళ్లను కోల్పోయారు. కుటుంబ పెద్దలు పోయిన పుట్టెడు దుఃఖంలో కలో, గంజో తాగి ప్రాణాలు నిలపుకొన్నారు. ఎక్కిరిస్తే పడ్డారు. ఎగతాళి చేస్తే భరించారు. కాళ్లకింద నలిపేస్తే కిక్కురుమనకుండా ఊరుకున్నారు. దేనికైనా ఓ సమయం ఉంటుందన్నట్టుగానే ఓపికకు కోపం వచ్చి ఇక తెగించాల్సిందే అని తిరగబడ్డారు. 60, 70లలోనే అంతా కలిసి కలియబడ్డారు. తమను తొక్కేస్తున్న శక్తులను ప్రతిఘటించారు. ఆ సమయంలో కూడా కొందరు స్వార్థ నాయకుల పదవీ వ్యామోహానికి దగాపడిన తెలంగాణ ప్రజాశక్తి చాలక చతికిలపడ్డారు. వెన్నుపోటు రాజకీయాలకు, ఢిల్లీ పెద్దలు ఆడించిన నాటకాలకు సర్కస్‌లోని జంతువుల మాదిరిగా వ్యవహరించిన కొందరు నేతల కక్కుర్తికి ఈ ప్రాంత ప్రజలంతా బిక్కమొహం వేయాల్సిన దుస్థితి దాపురించింది. నాలుగు వందలకు పైగా ప్రాణాలు గాల్లో కలిసినా చేసేదేమీ లేక అనుకున్నది సాధించలేక చేతులు ముడుచుకోవాల్సి వచ్చింది.

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కోటి ఎకరాల మాగాణమే పరమావధిగా శ్రమిస్తున్న ఉద్యమ నాయకుడి విజన్, నెట్టుకొస్తున్న తీరు, చక్కదిద్దేందుకు శ్రమిస్తున్న తీరు నచ్చాల్సింది ముమ్మాటికీ జనాలకు. అన్నింటికీ అంతిమమైన ఆప్షన్ వారి చేతుల్లోనే ఉంటుంది. ఎత్తుకోవాలన్నా వారే.. కుదేసి పడేయాలన్నా అవకాశం వారికే. వారి విచక్షణపై ఆధారపడి మసులుకోవాల్సిందే తప్ప, ఏ నాయకుడు, ఏ పార్టీ కూడా వారిని కాదని, వారిని పట్టించుకోకుండా గుడ్డిగా పోతానంటే అంగీకరించిన దాఖలాలు లేవు. అలాంటి వారి వెంట ప్రజలు నడిచిన చరిత్ర కూడా ఎక్కడా కానరాదు. రాష్ట్రం సాధించిన గొప్పతనాన్ని గుర్తించకున్నా పర్లేదు కనీసం దాన్ని గౌరవించాల్సిన అవసరాన్నయినా గమనించకపోవడమే దరిద్రం. ప్రజల కోసం పనిచేయడం దేవుడెరుగు, పదవుల కోసమే పరితపిస్తున్న తీరే బాధాకరం. పార్టీలే పరమావధిగా, ఇష్టారీతిగా ప్రకటించే ఎజెండాలే తమ విస్తృతిగా చెలరేగిపోతున్న నాయకుల వ్యవహారం జుగుప్సాకరం. నాయకుల మధ్య సవాలక్ష సవాళ్లు, ప్రతిసవాళ్లు ఉండనీగాక, ప్రజల్లో మెదులుకోవాల్సిన సమయంలో ప్రదర్శించాల్సిన హుందాతనం లోపించడమే ప్రజాస్వామ్య వ్యవస్థకు అగౌరవం కలిగించే విధానం.

పార్టీ ఏదైనా ముందుగా ప్రజల శ్రేయస్సే అంతిమంగా ఉండాలి. స్వప్రయోజనాల కోసం నోటికెంతొస్తే అంత మాటల నేసి, చేతికెంతొస్తే అంతా ఇస్తామని ప్రకటిస్తూ పూట గడుపుకొంటామంటే అతి అపహాస్యం చేయడమే. ఒంటెత్తు పోకడలతో ప్రవర్తిస్తానంటే ప్రజలను కించపర్చడమే కాకుండా, గత చరిత్ర తాలూకు కష్టాలను, ఉద్యమ నేపథ్యాన్ని కావాలని తొక్కేసినట్టుగా భావించాల్సి ఉంటుంది. ఒక్కనాటి కోసం ఎల్లకాలం ఉండే నిజాలను మరుగునపడేసేలా మసలుకోవడం సరికాదు.

ఎవరు ఔనన్నా, కాదన్నా తెలంగాణ రాష్ట్రం కోసం కావాల్సిన ఓ కేంద్ర బిందువు కేసీఆర్ రూపంలో లభించిన మాట వాస్తవం. ఎవరికి వారుగా పోరు సల్పి ఉండొచ్చు, ఎవరికి తోచిన విధంగా వారు నిరసనలు తెలిపి ఉండి ఉండొచ్చు గానీ అందరికీ కేరాఫ్‌గా నిలిచిన చారిత్రక ఉద్యమానికి ఆయనే ఓ ఆయువుపట్టు. యుద్ధంలో సైన్యమంతా తలపడినా, వెనుకుండి నడిపించే రాజే అంతిమంగా కర్త, కర్మ, క్రియగా నిలుస్తారు. ఓటమి చెంది మరణ దండన స్వీకరించాలన్నా, గెలుపు బావుటా ఎగరేసి కోల్పోయిన సంపదను తిరిగి సముపార్జించేలా ప్రణాళికలు రచిస్తూ, ప్రజలకు మెరుగైన పాలన అందించాలన్నా రాజుకు తప్పని పరిస్థితి.

కేసీఆర్ కూడా తెలంగాణ ప్రజల పక్షాన సాధించడానికి ఒంటరిగా ప్రయాణాన్ని మొదలుపెట్టి, ఎవరూ వెంట నడవని రోజు కూడా పట్టు కోల్పోక, ధైర్యాన్ని కూడగట్టుకొని ఎందరెందరినో ఎదిరిస్తూ, బలం కూడగట్టుకొని దేశమే చూసేలా చావును ముద్దాడి మరీ రాష్ట్రాన్ని సాధించిన నేత. ఈ పదేండ్లలో జరిగినవెన్నో, ఇంకా జరగాల్సినవి ఎన్నెన్నో.. అన్నీ ప్రజలు చూస్తున్నారు. ప్రతీది వారి మెమొరీలో పొందుపర్చుకుంటున్నారు. కేవలం పీఠాల కోసమే పాకులాడుతున్నదెవరో, ప్రజల కోసం అన్నీ భరిస్తున్నదెవరో అంతా చూస్తున్నదే. ఆ వేళ ప్రత్యేక ఉద్యమాన్ని మట్టి కరిపించేందుకు వైరి పక్షంలో నిలిచిన నేతలంతా ఇప్పుడు ఆ ఒక్కడిని ఎదుర్కోవడానికి ఏకమవుతున్న సందర్భమే అతి విచిత్రం. రాష్ట్రం ఎటుపోతే మాకేంటి, అప్పటి మా ప్రయోజనాలు, మా ప్రభువులు, మా ప్రభుత్వాలుంటే చాలనుకున్నవారంతా ఇప్పుడు ప్రజల పక్షాన పోరు సల్పుతున్నది తామే అనే ధోరణిలో ప్రవర్తించడం అతి విడ్డూరం. అంతా రాజులుగా చెలామణి అయిన సందర్భం మరిచి, ఇప్పుడు ప్రజలే రాజులు, మేం మీకు బానిసలం అంటూ సాగిస్తున్న వింత ప్రవర్తన అంతా గమనిస్తున్నారు. మాటలతో ఏమార్చే ప్రయత్నం చేసినా రుజువులు కండ్లముందు కనిపిస్తున్న విషయాలను మర్చిపోవద్దు. స్వార్థాన్ని చూసుకోకుండా దశాబ్దాలుగా జరుగుతున్న పోరాటానికి అంతిమ పరిష్కారం చూపాలని దండును కదిలించిన ఆనాటి ముచ్చట్లను అంతా మర్చిపోయారనుకుంటే తెలివి తక్కువతనమే.

కేసీఆర్ చేసిన త్యాగం ముందు ఇప్పుడు వీరు చేస్తున్న నక్క విన్యాసాలు ఎక్కడికక్కడ విచ్చుకుపోవాల్సిన తరుణం చూడటానికి ఇంకొన్ని రోజులు సమయం పట్టొచ్చుగానీ, అప్పటివరకు 'వేషాల'తో వ్యవహారం నడిపిస్తామంటే జనాలేం ఆలోచన లేని వారు కాదు. ఆ మాటకొస్తే ఆ బాపతు నాయకులు వేలం వెర్రిగా చేసే విన్యాసాలతో తెలంగాణ ఉనికి, ఈ ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతలన్నీ కాలగమనంలో కలిసిపోయే ప్రమాదాన్ని పసిగట్టాల్సిన అవసరం సమస్త జనంపైనా ఉంది. దానిని అడ్డుకట్ట వేయకపోతే భరించాల్సిన నష్టం భావితరాలకు చిక్కులు తెస్తుందనే కఠోర సత్యాన్ని అంతా గమనిస్తేనే మనుగడకు ముప్పు తప్పుతుంది. చివరగా కోట్లాదిగా కొట్లాడిన పోరాటానికి ఒక్కడై నిలిచిన చరిత్ర మాసిపోనిది, చరిత్ర ఎప్పుడూ తుడిచివేయలేనిది.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)

ఉమ్మడి రాష్ట్రంలో గడచిన అరవై ఏండ్లుగా పడావుగా ఉన్న భూమి స్వరాష్ట్రంలో సాగుకు నోచుకున్నది. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతు భరోసాగా 2018లో ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం దీనికి ఊపిరిపోసింది. ఇలాంటి పథకం ప్రపంచంలో ఏ దేశంలోనూ అమలైన దాఖలా లేదు.

తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆలోచనల నుంచి ఉద్భవించిన మానస పుత్రిక రైతుబంధు. రాష్ట్రంలో 58.33 లక్షల మంది రైతులకు ప్రతి ఎకరాకు పదివేల చొప్పన రైతుబంధు అందుతుండగా, వచ్చే ఐదేండ్లలో ఎకరాకు రూ.16 వేలు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న సంగతి మనందరికీ తెలిసిందే.



# పడావు భూమికి ప్రాణం



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
98495 77610

తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి వ్యవసాయ రంగమే కీలకం. ఇందులో ముఖ్యంగా సాగునీరు చాలా అవసరమైన అంశంగా పరిగణలోనికి తీసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ కాకతీయలో భాగంగా పూడుకుపోయిన వేలాది చెరువులను పునరుద్ధరించి పూర్వ వైభవం తీసుకువచ్చారు. కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులు నిర్మించి కాలువల ద్వారా చెరువులన్నీ నింపడంతో పాటు అనేక చిన్న, పెద్ద రిజర్వాయర్లను నిర్మించడంతో గ్రామాల్లో నీటి వసతి పెరిగింది. భూగర్భ జలాలు పెరుగడంతో ఒకప్పుడు పాడుబడిన రీతిలో దర్శనమిచ్చిన గ్రామా లు పచ్చతోరణం కట్టుకున్నాయి. సాగునీటి వసతి పెరుగటంతో పడావు పడ్డ భూములకు జీవం వచ్చినట్లయింది. రైతుబంధుతో పాటు, రైతు బీమా, రుణమాఫీ, గిట్టుబాటు ధరలు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కూడా తెలంగాణలో వ్యవసాయ రంగానికి ఊతమిచ్చాయి. మరోవైపు 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యు త్తు సాయం వ్యవసాయానికి మరింత బలాన్నిచ్చింది. పెరిగిన భూగర్భ జలాలు తెలంగాణ భూములను సస్యశ్యామలం చేశాయి.

తెలంగాణ భూభాగం ఎత్తులో ఉన్నందున సహజ నీటి ప్రవాహంతో జలాలు వ్యవసాయానికి అందుబాటులో ఉండేవి కావు. దీన్ని గమనించిన తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వర ఎత్తిపోతల లాంటి పథకాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టింది. ప్రాజె క్టు నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నిర్మించడంతో కోటి ఎకరాలకు సాగునీరు, ప్రజలకు ఇంటింటికీ తాగు నీరు ఇవ్వడానికి భగీరథ ప్రయత్నాలు వడివడిగా జరిగాయి. తెలంగాణలో ఉన్న 60 శాతం జనాభా గ్రామీణ వ్యవసాయ ఆధారిత జీవనోపాధితో ప్రగతిపథంలో పరుగెడుతున్నది. ఆంధ్ర పాలకుల కాలంలో నెర్రెలు వారిన బీళ్లు నేడు జల ప్రవాహాలతో పచ్చటి తివాచీలు పరిచినట్టు, అత్యధిక ఆహారధాన్యాలను ఉత్పత్తి చేస్తూ, 'రైస్‌బౌల్ ఆఫ్ సౌత్ ఇండియా'గా రూపాంతరం చెందింది.

మరోవైపు రైతుబంధు, రైతుబీమా, విత్తనాలు, ఎరువులు, భూరికార్డుల ప్రక్షాళన, ఐకేపీ సెంటర్ల ద్వారా ధాన్యం కొనుగోలు, వృద్ధాప్య, వితంతు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి ఆర్థిక చేయూతను ఇచ్చే అనేక విలక్షణ సంక్షేమ పథకాలను అమలు చేయటంతో గ్రామీణ వాతావరణం పూర్తిగా మారిపోయింది. పేదరికాన్ని జయించే మహాయజ్ఞంలో తెలంగాణ ముందున్నది. సంక్షేమ పథకాల అమలుతో పాటు సమగ్రాభివృద్ధి గ్రామీణ ప్రాంతాలకు కొత్త జవసత్వాలను తీసుకొచ్చాయి. మొత్తం మీద గడిచిన తొమ్మిది సంవత్సరాల కాలంగా సాధించిన ప్రగతి తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా రూపుదిద్దటంలో దోహద పడింది.